


# కుర్రాళ్లు కుమ్మేశారు

**అర్ధసెంచరీలతో మెరిసిన జైస్వాల్, గిల్**

**జింబాబ్వేపై భారత్ ఘన విజయం**

**3-1తో టీ20 సిరీస్ కైవసం**

**నేడు ఇరు జట్ల మధ్య ఐదో టీ20**

**కుర్రాళ్లు కదంతొక్కారు! సీనియర్ల గైర్హాజరీలో అవకాశాలను అందిపుచ్చుకుంటూ జింబాబ్వేతో మరో మ్యాచ్ మిగిలుండగానే టీ20 సిరీస్‌ను ఒడిసిపట్టుకున్నారు. ఏకపక్షంగా సాగిన నాలుగో టీ20 పోరులో టీమ్ఇండియా 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. జింబాబ్వే నిర్దేశించిన 153 పరుగుల లక్ష్యాన్ని యువభారత్ వికెట్ కోల్పోకుండా 16వ ఓవర్‌లోనే విజయాన్నందుకుంది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో విజృంభిస్తే..గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. తొలుత బౌలర్ల సమిష్టి ప్రదర్శనతో జింబాబ్వే 152 పరుగులు చేసింది. సిరీస్‌లో ఇరు జట్ల మధ్య చివరిదైన ఐదో టీ20 మ్యాచ్ నేడు జరుగనుంది.**

హరారే: జింబాబ్వేతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ తమ ఖాతాలో వేసుకుంది. మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌లో టీమ్ఇండియా 3-1తో ఆధిక్యంలో నిలిచింది. శనివారం జరిగిన నాలుగో టీ20లో భారత్ 10 వికెట్ల తేడాతో జింబాబ్వేపై భారీ విజయం సాధించింది. తొలుత జింబాబ్వే నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. కెప్టెన్ సికిందర్ రజా(46) టాప్ స్కోరర్‌గా నిలువగా, మరుమని(32) ఆకట్టుకున్నాడు. ఖలీల్ అహ్మద్(2/32) రెండు వికెట్లు తీయగా, దేశ్‌పాండే, సుందర్, అభిషేక్, దూబే ఒక్కో వికెట్ తీశారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన టీమ్ఇండియా 15.2 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా విజయాన్నందుకుంది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్(53 బంతుల్లో 93 నాటౌట్, 13ఫోర్లు, 2సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్(39 బంతుల్లో 58 నాటౌట్, 6ఫోర్లు, 2సిక్స్‌లు) అర్ధసెంచరీలతో విజృంభించారు. పసలేని జింబాబ్వే బౌలింగ్‌ను చీల్చిచెండాడుతూ ఈ యువ ద్వయం జట్టుకు అలవోక విజయాన్ని అందించారు. ముఖ్యంగా ఆకాశమే హద్దుగా చెలరేగిన జైస్వాల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.





**జైస్వాల్, గిల్ ధనాధన్:** జింబాబ్వే నిర్దేశించిన లక్ష్యఛేదనలో యువ ఓపెనర్లు జైస్వాల్, గిల్ ఆది నుంచే తమదైన దూకుడు కనబరిచారు. గరవ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే జైస్వాల్ మూడు ఫోర్లతో దంచుడు మొదలుపెట్టాడు. ఆ తర్వాత తన వంతు అన్నట్లు గిల్ కూడా బ్యాటుకు పనిచెప్పాడు. చతార వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లో జైస్వాల్ చుక్కలు చూపెట్టాడు. నాలుగు ఫోర్లు 16 పరుగులు పిండుకున్నాడు. దీంతో నాలుగో ఓవర్‌లోనే టీమ్ఇండియా 50 పరుగుల మార్క్ అందుకుంది. పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ 61 పరుగులు చేసింది. బౌలింగ్ మార్పుగా వచ్చిన కెప్టెన్ రజాను కూడా జైస్వాల్ అరుసుకున్నాడు. ఈ క్రమంలో 29 బంతుల్లోనే జైస్వాల్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ఏ దశలోనూ వెనుకకు తగ్గని ఈ జోడీ బౌలర్ ఎవరన్నది లెక్కచేయకుండా ముందుకు సాగింది. ఫరజ్ అక్రమ్ వేసిన 10వ ఓవర్‌లో గిల్ మూడు ఫోర్లు కొట్టి ఇన్నింగ్స్‌ను టాప్‌గేర్‌లో తీసుకెళ్లాడు. వీరిద్దరిని విడదీసేందుకు కెప్టెన్ రజా ఎన్ని రకాలుగా ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. వీరి దూకుడైన బ్యాటింగ్‌తో లక్ష్యం అంతకంతకూ కరుగుతూ వచ్చింది. ఆఖర్లో ముజర్‌బనీ బౌలింగ్‌లో ఫోర్‌తో జైస్వాల్ గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశాడు.

**రజా మెరిసినా:** తొలుత బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వేకు మెరుగైన శుభారంభం దక్కింది. ఓపెనర్లు వెస్లి మెద్వెరె(25), మరుమని(32) టీమ్ఇండియా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొన్నారు. ఖలీల్ అహ్మద్ మూడో ఓవర్‌లో మరుమని ఇచ్చిన దూబే జారవిడువడంతో బతికిపోయాడు. ఇదే అదనుగా చెలరేగడంతో జింబాబ్వే తొలి ఆరు ఓవర్లు ముగిసే సరికి వికెట్ నష్టపోకుండా 44 పరుగులు చేసింది. టీ20ల్లో భారత్‌పై తొలి వికెట్‌కు జింబాబ్వే అత్యుత్తమ భాగస్వామ్యాన్ని నమోదు చేసుకుంది. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని మరుమనిని ఔట్ చేయడం ద్వారా అభిషేక్ విడగొట్టాడు. మరో ఎండ్‌లో బౌలింగ్‌కు వచ్చిన దూబే..వెస్లీని ఔట్ చేసి భారత్‌ను పోటీలోకి తీసుకొచ్చాడు. ఈ క్రమంలో ఇన్నింగ్స్ బాధ్యతను రజా తీసుకున్నాడు. అంతర్జాతీయ టీ20ల్లో రెండు వేల పరుగుల మార్క్ దాటేసిన రజా..టీమ్ఇండియా బౌలర్లను నిలువరించాడు. ఓవైపు సహచరులు నిష్క్రమిస్తున్నా..రజా వెనుకకు తగ్గలేదు. చివరకు దేశ్‌పాండే బౌలింగ్‌లో గిల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఖలీల్ 20వ ఓవర్‌లో రెండు వికెట్లు తీసి ఐదు పరుగులకే పరిమితం కావడంతో జింబాబ్వే ఇన్నింగ్స్‌కు తెరపడింది.

**సంక్షిప్త స్కోర్లు**


**జింబాబ్వే:** 20 ఓవర్లలో 152/7(రజా 46, మరుమని 32, ఖలీల్ 2/32, అభిషేక్ 1/20), **భారత్:** 15.2 ఓవర్లలో 156/0 (జైస్వాల్ 93 నాటౌట్, గిల్ 58 నాటౌట్)



## రన్నరప్ రాజారిత్విక్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: లప్లేన్ ఇంటర్నేషనల్ చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ గ్రాండ్‌మాస్టర్ రాజారిత్విక్ రన్నరప్‌గా నిలిచాడు. ఫ్రాన్స్‌లోని లప్లేన్‌లో జరిగిన టోర్నీలో రిత్విక్ తొమ్మిది రౌండ్లలో ఏడు పాయింట్లతో రెండో స్థానంతో రజతం దక్కించుకున్నాడు. ఈ టోర్నీలో 22 దేశాల నుంచి 184 మంది మేటి ప్లేయర్లు పోటీపడ్డారు. తొమ్మిది రౌండ్లలో రిత్విక్ అజేయంగా నిలిచి రన్నరప్ టైటిల్ ఖాతాలో వేసుకున్నాడు. ఐదు గేమ్స్‌లో గెలిచిన ఈ యువ జీఎం నాలుగింటిని డ్రా చేసుకున్నాడు.

## చెస్ ఒలింపియాడ్‌లో ఇరిగేసి అర్జున్



చెన్నై: ప్రతిష్ఠాత్మక చెస్ ఒలింపియాడ్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేసి అర్జున్ పోటీపడనున్నాడు. సెప్టెంబర్‌లో బుడాపెస్ట్ (హంగేరీ)లో జరిగే ఈ టోర్నీలో పోటీపడే భారత పురుష ల, మహిళల జట్లను ఆల్ఇండియా చెస్ ఫెడరేషన్(ఏఐసీఎఫ్) శనివారం ప్రకటించింది. పురుషుల విభాగంలో అర్జున్‌తో పాటు హరికృష్ణ, గుకేశ్, ప్రజ్ఞానంద, విదిత్ సంతోష ఉన్నారు.

## సీడెడ్ రెజ్లర్లుగా అంతిమ్, అమన్

పారిస్: ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌లో భారత రెజ్లర్లు అంతిమ్ పంఘల్(53కి), అమన్ షెరావత్(57కి)సీడింగ్ దక్కింది. తమ తమ విభాగాల్లో వరుసగా అంతిమ్ నాలుగో సీడ్, అమన్ ఆరో సీడ్‌గా బరిలోకి దిగనున్నారు. దీంతో తొలి బౌట్లలో కఠిన ప్రత్యర్థులు ఎదురయ్యే పరిస్థితి నుంచి అంతిమ్, అమన్ బయటపడ్డారు. విశ్వక్రీడల్లో రెజ్లింగ్ పోటీలు ఆగస్టు 5 నుంచి 11వ తేదీ వరకు జరుగనున్నాయి.



**విజేత: క్రెజికోవా: 28.64 కోట్లు**
**రన్నరప్: పాలిని: 14.85 కోట్లు**

# క్వీన్ క్రెజికోవా

- **వింబుల్డన్ టైటిల్ కైవసం**
- **ఫైనల్లో జాస్మిన్‌పై అద్భుత విజయం**

లండన్: ప్రతిష్ఠాత్మక వింబుల్డన్‌లో నయా చాంపియన్ అవతరించింది. అసలు ఎలాంటి అంచనాలు లేకుండా పోటీకి దిగి తొలిసారి కప్‌ను ఒడిసిపట్టుకుంది. మెగా టోర్నీలో ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ, టైటిల్ ఫేవరేట్లకు చెక్ పెట్టిన చెక్ రిపబ్లిక్ ప్లేయర్ బార్బరా క్రెజికోవా వింబుల్డన్ టైటిల్ విజేతగా నిలిచింది. శనివారం ఆసక్తికరంగా సాగిన మహిళల సింగిల్స్ తుదిపోరులో క్రెజికోవా 6-2, 2-6, 6-4తో ఏడో సీడ్ జాస్మిన్ పాలిని(ఇటలీ)పై అద్భుత విజయం సాధించింది. 2022లో ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ కైవసం చేసుకున్న క్రెజికోవా కెరీర్‌లో ఇది రెండోది కావడం విశేషం. టోర్నీ ఆసాంతం ప్రత్యర్థులను చిత్తుచేస్తూ ముందుకు సాగిన ఇటలీ సంచలనం పాలినికి ఆఖరి పోరులో మరోమారు చుక్కెదురైంది. ఈ సీజన్‌లో వెన్నునొప్పికి శస్త్రచికిత్స చేయించుకున్న క్రెజికోవా టోర్నీకి ముందు ఆడిన 16 మ్యాచ్‌ల్లో ఏడింటిలోనే గెలిచింది. ఇదిలా ఉంటే గత ఎనిమిది ఎడిషన్లలో ఎనిమిది మంది కొత్త వాళ్లు చాంపియన్లుగా నిలువడం విశేషం. ఫైనల్ విషయానికొస్తే..పాలినిపై క్రెజికోవా తనదైన ఆధిపత్యం ప్రదర్శించించింది. దూకుడు ప్రదర్శించిన క్రెజికోవా 6 ఏస్‌లు, 28విన్నర్లు, మొత్తం 85 పాయింట్లతో సత్తాచాటింది. 4 డబుల్ ఫాల్ట్స్, 37 అనవసర తప్పిదాలు చేసినా 7 బ్రేక్ పాయింట్లతో మూడింటిని సద్వినియోగం చేసుకుంది. మరోవైపు 3 ఏస్‌లకు పరిమితం అయిన పాలిని ఒక డబుల్ ఫాల్ట్, 23 అనవసర తప్పిదాలు చేసింది.

**క్రెజికోవా సూపర్:** జాస్మిన్ పాలినిపై క్రెజికోవాదే పైచేయి అయ్యింది. ఆరేండ్ల కింద ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో జాస్మిన్‌తో మొదటిసారి తలపడ్డ క్రెజికోవా ప్రస్తుతం అదే ఫలితాన్ని పునరావృతం చేసింది. తొలి సెట్‌ను క్రెజికోవా అలవోకగా దక్కించుకుంది. అయితే రెండో గేమ్‌లో అద్భుతంగా పుంజుకున్న పాలిని తిరిగి పోటీలోకి వచ్చింది. బలమైన బ్యాంక్‌హ్యాండ్, ఫోర్‌హ్యాండ్ షాట్లతో ఇరువురు ప్లేయర్లు ఆకట్టుకున్నారు. నిర్ణయాత్మక మూడో సెట్‌లో క్రెజికోవా..పాలినికి ఎలాంటి అవకాశమ్వికుండా ముందుకుసాగడంతో మ్యాచ్ రసవత్తరంగా సాగింది. మొదటి ఆరు గేమ్‌లు హోరాహోరీగా సాగగా, ఏడో గేమ్ నుంచి క్రెజికోవా పట్టు సాధించి మ్యాచ్‌ను వశం చేసుకుంది.

# యూరో వార్ నేడే

**ఇంగ్లండ్, స్పెయిన్ ఫైనల్ పోరు**

బెర్లిన్: యూరోపియన్ చాంపియన్‌షిప్‌లో టైటిల్ ఫైట్‌కు సమయం ఆసన్నమైంది. గత కొన్ని రోజులుగా ఫుట్‌బాల్ అభిమానులకు పసందైన విందు అందిస్తున్న యూరో కప్ టైటిల్ విజేత ఎవరో మరికొన్ని గంటల్లో తేలనుంది. అసలు అంచనాలు లేకుండా బరిలోకి దిగి అప్రతిహత విజయాలతో దూసుకెళుతున్న స్పెయిన్ ఒకవైపు అయితే వరుసగా రెండోసారి ఫైనల్ పోరులో నిలిచిన ఇంగ్లండ్ ఈసారైనా కప్‌ను ముద్దాడాలన్న పట్టుదలతో ఉంది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి 12.30గంటలకు మొదలయ్యే స్పెయిన్, ఇంగ్లండ్ ఢీ అంటే ఢీ అననున్నాయి. ఇప్పటి వరకు జర్మనీతో కలిసి అత్యధిక సార్లు(3) టైటిల్ దక్కించుకున్న స్పెయిన్ రికార్డు స్థాయిలో నాలుగో సారి టైటిల్ దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నది. కీలకమైన సెమీస్‌లో టైటిల్ ఫేవరేట్లలో ఒకటిగా భావించిన ఫ్రాన్స్‌పై స్పెయిన్ అద్భుత విజయం సాధించింది. ముఖ్యంగా 16 ఏండ్ల నూనుగు మీసాల కుర్రాడు లామిన్ యమాల్ సంచలనం సృష్టించాడు. ఫ్రాన్స్ రక్షణశ్రేణిని ఏమారుస్తూ యమాల్ కొట్టిన గోల్ టోర్నీలో హైలెట్‌గా నిలిచింది. శనివారం 17వ పుట్టిన రోజు జరుపుకున్న యమాల్..స్పెయిన్ గెలిస్తే..అతి పిన్న వయసులో ట్రోఫీ గెలిచిన ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కనున్నాడు. మరోవైపు తమ సుదీర్ఘ కల సాకారం కోసం ఇంగ్లండ్ సత్తాచాటే అవకాశముంది. మొత్తంగా రెండు అత్యుత్తమ జట్ల మధ్య పోరు అభిమానులను అలరించడం ఖాయంగా కనిపిస్తున్నది.



# కింగ్ ఎవరో?

***నేడు అల్కారజ్, జొకోవిచ్ ఫైనల్ పోరు***

*లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మెగాఫైట్‌కు రంగం సిద్ధమైంది. ఆదివారం పురుషుల సింగిల్స్ ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కారజ్, సెర్బియా దిగ్గజం నోవాక్ జొకోవిచ్ అమీతుమీ తేల్చుకోనున్నారు. రికార్డు స్థాయిలో ఎనిమిదో సారి వింబుల్డన్ విజేతగా నిలువాలని జొకో పట్టుదలతో ఉంటే..తన టైటిల్ నిలబెట్టుకునేందుకు అల్కారజ్ సర్వశక్తుల ఒడ్డే అవకాశముంది. జొకోవిచ్ 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ కల నెరవేరుతుందా లేక అల్కారజ్ ఖాతాలో రెండో వింబుల్డన్ ట్రోఫీ చేరుతుందా అన్నది మరికొన్ని గంటల్లో తేలనుంది.*

# పాంటింగ్‌కు ఉద్వాసన

**ఢిల్లీ క్యాపిటల్స్ కోచ్‌గా గంగూలీ!**



న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు అనూహ్య నిర్ణయం తీసుకుంది. గత కొన్నేండ్లుగా చీఫ్‌కోచ్‌గా వ్యవహరిస్తున్న ఆస్ట్రేలియా గ్రేట్ రికీ పాంటింగ్‌కు ఉద్వాసన పలికింది. ఈ మేరకు శనివారం తమ టీమ్ అధికారిక సోషల్‌మీడియా ఖాతాలో వివరాలు వెల్లడించింది. పాంటింగ్ స్థానంలో ఇప్పటి వరకు జట్టు టీమ్ డైరెక్టర్‌గా ఉన్న సౌరవ్ గంగూలీని ప్రధాన కోచ్‌గా నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి. 'ప్రధాన కోచ్‌గా మీరు వెళ్తున్న వేళ..ఆ మాటలను పదాలలో వర్ణించలేకపోతున్నాం. ప్రతి సందర్భంలో నాలుగింటి(కేర్, కమిట్‌మెంట్, అటిట్యూడ్, ఎఫర్ట్) గురించి గత ఏడేండ్ల కాలంలో చర్చించడంలో కీలకంగా వ్యవహరించావు' అని రాసుకొచ్చింది. 2019లో ఢిల్లీ జట్టుతో చేరిన పాంటింగ్ జట్టుకు టైటిల్ అందించడంలో సఫలం కాలేకపోయాడు. ఈ విషయంలో ఒకింత అసంతృప్తితో ఉన్న టీమ్ మేనేజ్‌మెంట్ కోచింగ్ బృందాన్ని మార్చేందుకు మొగ్గుచూపినట్లు తెలిసింది.

బ్యాంకాక్ & పట్టాయా 4N / 5D
స్పెషల్ టూర్ బంపర్ డిస్కౌంట్
కేవలం
31,999/-
*షరతులు వర్తిస్తాయి
R.V. TOURS AND TRAVELS PVT. LTD. 7032666927, 9100090873
Domestic | Rajasthan -49,000/- | Mukthinath -72,500/- | Kerala -46,000/- | Srinagar -56,000/-
International | Srilanka -57,000/- | Europe -3,20,000/- | Singapore-Malaysia -99,000/- | Dubai -69,999/-